బడి అదుర్స్

డుంబ్రిగుడ: మండలంలోని అరకు సంతబయలు సమీపంలో జైపూర్ జంక్షన్ వద్ద నూతనంగా నిర్మించిన పాఠశాల భవనం అందర్నీ ఆకర్షిస్తోంది.నాడు-నేడులో ఈ భవనాన్ని నిర్మించారు. అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆకర్షించే రంగులు, బొమ్మలతో పాఠశాలను తీర్చిదిద్దారు.



జీపు బోల్తా పడి ఒకరి మృతి

- మరొకరి పరిస్థితి విషమం, 8 మందికి తీవ్ర గాయాలు

8లో



న్యూస్‌రీల్

స్పందనలో 50 అర్జీల స్వీకరణ



ఐటీడీఏ పీవో సూరజ్‌గనొరేకు సమస్యలు వివరిస్తున్న ఎంపీపీ శ్రీదేవి

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏ సమావేశం హాలులో సోమవారం ఐటీడీఏ పీవో సూరజ్‌గనొరే, సబ్ కలెక్టర్ కట్టా సింహాచలం స్పందన కార్యక్రమం నిర్వహించి, 50 అర్జీలు స్వీకరించి, పలు సమస్యలను పరిష్కరించారు. రంపచోడవరం ఎంపీపీ బందం శ్రీదేవి పలు సమస్యలను పీవో దృష్టికి తీసుకువచ్చారు. మండలంలో విద్యుత్ సబ్సిడీ కోల్పోయిన గిరిజనులకు తిరిగి సబ్సిడీ కల్పించాలని, కాకినాడ, రాజమహేంద్రవరాలలోని ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లే గిరిజన రోగులకు సత్వర వైద్య సేవలు కోసం ఒక సహాయకుడ్ని అక్కడ ఏర్పాటు చేయాలని కోరారు. నరసాపురం పీహెచ్‌సీ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.ఎంపీపీతో పాటు ఎంపీటీసీలు తుర్రం వెంకటేశ్వర్లు,నర్రి పాపారావు, కుంజం వంశీ,గుడి చైర్మన్ బొబ్బా శేఖర్‌లు ఉన్నారు. అడ్డతీగలలో కమ్యూనిటీ హాల్ స్థలానికి పట్టా మంజూరు చేయాలని ఆదివాసీ చైతన్యవేదిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి కోరారు. మారేడుమిల్లిలో బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, ఈఈ డేవిడ్‌రాజ్, ఏడీఎంహెచ్ అనూష, ఏవో రమణ పాల్గొన్నారు.

సహాయ సమన్వయకర్త పోస్టుకు దరఖాస్తులు

సాక్షి,పాడేరు : గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో జిల్లా సహాయ సమన్వయకర్త నియామకానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెలకు రూ.27వేల వేతనంతో తాత్కాలిక ప్రాతిపదికన ఈ పోస్టును భర్తీ చేస్తున్నామన్నారు. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 28తేదీ సాయంత్రం 5గంటల్లోపు పనిదినాల్లో కలెక్టరేట్‌లోని డీఈ అండ్‌ఎస్‌వో కార్యాలయంలో రిజిస్టర్ పోస్టు ద్వారా దరఖాస్తులు అందజేయాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు హెచ్‌టీటీపీఎస్://అల్లూరిసీతారామరాజు.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌తో పాటు కలెక్టరేట్‌లోని డీఈ అండ్ ఎస్‌వో కార్యాలయం నోటీసు బోర్డులో పరిశీలించవచ్చని కలెక్టర్ సూచించారు.

అక్షర వెలుగు కో-ఆర్డినేటర్ల భర్తీకి ఇంటర్వ్యూ నేడు

అరకులోయ రూరల్: అక్షర భారత్ అక్షర వెలుగు విద్యా ప్రాజెక్టులో మండల కోఆర్డినేటర్ల పోస్టుల భర్తీకి మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు అక్షర వెలుగు ప్రాజెక్టు మేనేజర్ రామరావు సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి అరకులోయ మండల పరిషత్ కార్యాలయం వద్ద దరఖాస్తులు స్వీకరించి, ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

పాడేరు, అరకులోయ, అనంతగిరి, పెదబయలు మండలాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయని, సొంత మండలాలవారే ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు, డిగ్రీ ఉత్తీర్ణులైన వారు 10వ తరగతి,ఇంటర్, డిగ్రీ ధ్రువీకరణ పత్రాలతో పాటు రెండు పాస్ ఫొటోలతో హాజరు కావాలని తెలిపారు.

కాఫీ రైతులను మ్యాక్స్ సొసైటీ సభ్యులుగా చేర్చాలి

ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు

సాక్షి, పాడేరు: ఐటీడీఏ పరిధిలోని కాఫీ రైతులను మ్యాక్స్ సొసైటీలో సభ్యులుగా చేర్చాలని ఐటీడీఏ ఏపీవో(పీవీటీజీ) ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. కాఫీ విభాగం అధికారులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మ్యాక్స్ సొసైటీలో సభ్యత్వానికి గిరిజన రైతులు రూ.110 చెల్లించాలని తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కొయ్యూరు, జి.కె.వీధి, చింతపల్లి, జి.మాడుగుల, పాడేరు, పెదబయలు, హుకుంపేట మండలాల్లో కాఫీ, మిరియాల ఉత్పత్తుల అంచనాలు సిద్ధం చేసి, తమకు అందజేయాలని సూచించారు. ఈ ఏడాది కొత్తగా 15వేల ఎకరాల్లో కాఫీ తోటల పెంపకం చేపట్టేందుకు పనులు జరుగుతున్నాయని, ఎకరాకు 100 మిరియాలు, నీడ మొక్కలు, నేరేడు, మామిడి, పనస మొక్కల పంపిణీని కూడా పూర్తి చేశామన్నారు. ఐటీడీఏ పీహెచ్‌వో ఎల్.అశోక్ మాట్లాడుతూ కాఫీ రైతులను మ్యాక్స్ సొసైటీలో చేర్చడం ద్వారా దళారీ వ్యవస్థను నిరోధించవచ్చన్నారు. గిరిజన రైతులకు కనీస మద్దతు ధర అందించే అవకాశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో చింతపల్లి ఎకో పల్పింగ్ యూనిట్ ప్రతినిధులతో పాటు అన్ని మండలాల పీహెచ్‌వోలు, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

• సేంద్రియ సాగు బాగు



థింసా నృత్యంతో స్వాగతం పలుకుతున్న గిరిజన మహిళలు



దొడ్డిపల్లి ప్రాంతంలో న్యూట్రీ గార్డెన్‌ను పరిశీలిస్తున్న జేమ్స్ రోమాక్స్, ఇతర అధికారులు

జిల్లాలో ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన పంటలు పండించడం అద్భుతంగా ఉందని ఐక్యరాజ్య సమితి ఎన్విరాన్‌మెంట్, పొల్యూషన్ ప్రతినిధి జేమ్స్ రోమాక్స్ సంతోషం వ్యక్తం చేశారు. ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం చేసేందుకు ఐక్యరాజ్య సమితి ఎన్విరాన్‌మెంట్, పొల్యూషన్ ప్రతినిధి, కెన్యా దేశస్తుడు జేమ్స్ రోమాక్స్ పాడేరు డివిజన్‌లో పలు గ్రామాల్లో సోమవారం పర్యటించారు. వరి, న్యూట్రి గార్డెన్‌లు, కాఫీ, మిరియాలు, చిరుధాన్యాలు, పసుపు పంటలను పరిశీలించారు. తుంపాడ రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి , రైతులకు అమలవుతున్న కార్యక్రమాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలు బొర్రమామిడి గ్రామంలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. థింసా నృత్యాలతో తమ గ్రామానికి తీసుకువెళ్లారు. గిరిజన వాయిద్యాలతో ఆహ్వానించారు. – సాక్షి,పాడేరు

ఈపీడీసీఎల్ సేవలు భేష్

- మెరుగైన విద్యుత్ సరఫరా అందిస్తున్నారు
- స్వల్ప లోటుపాట్లను సరిదిద్దుకోవాలి
- ఇకపై సబ్‌స్టేషన్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తాం
- ఈపీడీసీఎల్ పరిధిలోనే అనకాపల్లి ఆర్ఈసీఎస్
- ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ నాగార్జున రెడ్డి

సాక్షి, విశాఖపట్నం : వినియోగదారులకు విద్యుత్ సరఫరా విషయంలో ఈపీడీసీఎల్ సేవలు అద్భుతంగా ఉన్నాయని ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి ప్రశంసించారు. ఈపీడీసీఎల్ పరిధిలోని జిల్లాల అధికారులతో ప్రధాన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఏపీ ట్రాన్స్‌కో సబ్ స్టేషన్ల పనితీరుతో పాటు ఫీడర్లలో లోపాలు, ఓవర్‌లోడ్, మరమ్మతులు, కెపాసిటీ తదితర అంశాలపై సమీక్షించారు. ఆటోమెటిక్ కాంపన్సేషన్, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లోటుపాట్లలో తనిఖీలు, వినియోగదారుల నుంచి వస్తున్న ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. స్టాండర్డ్ ఆఫ్ పెర్‌ఫార్మెన్స్ (ఎస్‌వోపీ) అమలు చేసే విషయంలో సీరియస్‌గా వ్యవహరించాలని ఆదేశించారు. అనంతరం మీడియాతో జస్టిస్ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ ట్రాన్స్‌కో, డిస్కంల మధ్య సమన్వయం ఉండేలా, పలు సమస్యలపై చర్చించి, పంపిణీ సంస్థలను బలోపేతం చేసేందుకు ఈఆర్‌సీ చర్యలు తీసుకుంటోందన్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణలు, సమీక్షలు నిర్వహించి.. సిబ్బందిని అన్ని విధాలా అప్రమత్తం చేయడం ఈఆర్‌సీ ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇకపై తరచుగా సబ్‌స్టేషన్లను తనిఖీలు చేసి క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలపై దృష్టిసారిస్తామన్నారు. వినియోగదారులకు ఈపీడీసీఎల్ నాణ్యమైన సేవలందిస్తోందని కొనియాడారు. బకాయిల వసూలు, రైతులకు మెరుగైన విద్యుత్ సరఫరా వంటి అంశాల్లో సిబ్బంది అద్భుతంగా పనిచేస్తున్నారన్నారు. అనకాపల్లి ఆర్ఈసీఎస్ మొత్తం పర్యవేక్షణ ఈపీడీసీఎల్ పరిధిలోకి తీసుకున్నామని చైర్మన్ స్పష్టం చేశారు. ఆర్ఈసీఎస్‌లో అనధికార వ్యక్తుల కార్యకలాపాలకు స్వస్తి చెప్పామనీ.. వారికి చెల్లించిన వేతనాల్ని కూడా వెనక్కు రప్పించుకున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం అక్కడ ఈపీడీసీఎల్ పరిధిలో పనిచేస్తున్న వారికే జీతాలు చెల్లిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఈఆర్‌సీ డైరెక్టర్లు ఠాకూర్ రామసింగ్, పి.రాజగోపాల్ రెడ్డి, ఈపీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు, డైరెక్టర్లు రమేష్ ప్రసాద్, చంద్రం , ట్రాన్స్‌కో డైరెక్టర్ భాస్కర్, సీజీఎంలు విజయలలిత, సుమన్‌కల్యాణి, సింహాద్రి, శ్రీనివాసమూర్తి, ఎస్ఈ మహేంద్రనాథ్, డీఈ శ్రీనివాస్‌తో పాటు ఈపీడీసీఎల్ విభాగాధిపతులు, అధికారులు పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న సామాజిక న్యాయ సాధికారిక మంత్రిత్వశాఖ సభ్యుడు నరసింహ, పక్కన ఐటీడీఏ పీవో తదితరులు

- అధికారులకు సామాజిక న్యాయ సాధికారిక కేంద్ర మంత్రిత్వశాఖ సభ్యుడు నరసింహ ఆదేశం
- రాష్ట్రంలో ఇంగ్లిమ మీడియం అమలు హర్షణీయం



హాజరైన అధికారులు, ఉపాధ్యాయులు

సాక్షి,పాడేరు: గిరిజన ప్రాంతంలో విద్య,వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సామాజిక న్యాయ సాధికారిక కేంద్ర మంత్రిత్వశాఖ సభ్యుడు తురక నరసింహ ఆదేశించారు. జిల్లాలో గుర్తించని సామాజిక గిరిజన తెగలు, సంచార జాతులకు అందుతున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాల పరిశీలనకు సోమవారం ఆయన జిల్లా కేంద్రం పాడేరు చేరుకున్నారు. ముందుగా మోదకొండమ్మను దర్శించుకున్నారు. ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ, ఇతర అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో నరసింహ మాట్లాడుతూ గిరిజనులకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణ బాధ్యత వైద్య ఆరోగ్యశాఖదేనని తెలిపారు. సీజనల్ వ్యాధులు, వాటి నివారణ, ఆరోగ్యశ్రీలో అమలవుతున్న వైద్య సేవలపై ఆయన సమీక్షించారు. గిరిజన ప్రాంతాల్లో వనమూలికలు, వివిధ రకాల పండ్ల జాతులు, చిరుధాన్యాల వినియోగంపై కూడా గిరిజనులను చైతన్యపరచాలని, వాటి ద్వారా అందుబాటులోకి వచ్చే పౌష్టికాహారంపై ప్రచారం చేయాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో గుణాత్మక విద్యకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలన్నారు. నూతన విద్యా విధానంలో భాగంగా ఆంగ్ల మీడియం విద్యను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టడం హర్షణీయమన్నారు. విద్యావిధానంలో తీసుకురావాల్సిన మార్పులు, ఇతర అంశాలపై ఉపాధ్యాయులు అధ్యయనంచేసి నివేదిక అందించాలన్నారు. ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో గుర్తించని సంచార జాతుల కుటుంబాలు లేవని చెప్పారు. మిషన్ కనెక్ట్ పాడేరు ద్వారా రూ.735 కోట్లతో రోడ్లు నిర్మాణాలకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నెట్ కనెక్టివిటీకి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అటవీహక్కులచట్టంద్వారా ఇప్పటి వరకు 1.06లక్షల ఎకరాలను గిరిజనులకు పంపిణీ చేసినట్టు తెలిపారు. వైద్యఆరోగ్యశాఖ ద్వారా గిరిజనులకు అందిస్తున్న మెరుగైన సేవలను డీఎంహెచ్‌వో డాక్టర్ బి.సుజాత, జిల్లాలో విద్యా కార్యక్రమాలను డీఈవో పి.రమేష్ ఆయనకు నివేదించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో బి.దయానిధి, ఏఎస్పీ తుహిన్ సిన్హా, గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు, డీఎఫ్‌వో వినోద్‌కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పర్యాటకులను ఆకర్షించేలా వంజంగి హిల్స్ అభివృద్ధి

ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

సాక్షి, పాడేరు : పర్యాటకులను మరింతగా ఆకర్షించేలా వంజంగి హిల్స్ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. వంజంగి హిల్స్ అభివృద్ధిపై సోమవారం ఐటీడీఏలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ పర్యాటకులకు తెల్లవారు జామున నాలుగు గంటలకు మాత్రమే ప్రవేశం కల్పించాలని సూచించారు. సందర్శకులు ప్లాస్టిక్ బ్యాగులు, మద్యం, గంజాయి తీసుకురాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అధికారుల బృందం, సర్పంచులు కలిసి ఈ నెల 20న వంజంగి ప్రాంతంలో పర్యటించి టోల్ గేటు ఏర్పాటు, పార్కింగ్ ప్రదేశం, రవాణా సదుపాయాలు, తాగు నీటి సౌకర్యాలు కల్పన తదితర అంశాలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పర్యాటక ప్రాంతంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. డీఎఫ్‌వో వినోద్‌కుమార్ మాట్లాడుతూ అటవీశాఖ నిధులు రూ.50 లక్షలతో వంజంగి హిల్స్‌పై మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వంజంగి త్రినాథరావు, ఎంపీడీవో సాయి నవీన్, ఎంపీటీసీ ఎల్.రామకృష్ణ పాత్రుడు, లగిశపల్లి, కాడెలి, వంజంగి సర్పంచులు ఎల్.పార్వతమ్మ, వి.బసవన్నదొర, వి.బొంజు బాబు, ఎల్.అబ్బాయిదొర తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యమే ప్రభుత్వ లక్ష్యం

కలెక్టర్ సుమిత్ కుమార్



ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చింతపల్లి: గిరిజనులకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రిని సోమవారం ఆయన తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీసి, వైద్య సిబ్బంది పనితీరు గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని చెప్పారు. ఇందులో భాగంగా స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రిలో ప్లేట్‌లెట్స్ లెవెల్స్‌ను నిర్ధారించే పరికరాన్ని వారం రోజుల్లో ఏర్పాటు చేస్తామన్నారు. ఇద్దరు గైనకాలజిస్టులను కూడా నియమించనున్నట్టు చెప్పారు. ఇప్పటి వరకు ప్రతీ నెలా నర్సీపట్నం నుంచి గైనకాలజిస్ట్ వచ్చి పరీక్షలు చేసేవారని, ఇకపై ఆ ఇబ్బందులు ఉండవన్నారు. శీతాకాలంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చిన్న పిల్లల విభాగంలో తగిన సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. వర్షాల కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య బృందాలను అప్రమత్తం చేశామని ఆయన తెలిపారు. విధి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ డిప్యూటీ సివిల్ సర్జన్ మహేశ్వరరావు, డాక్టర్ హిమబిందు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అసంపూర్తిగా ఉన్న సచివాలయ, ఆర్బీకే భవనాలు సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పక్కా గృహాల నిర్మాణానికి సంబంధించి జియోట్యాగింగ్, ఇంటింటికీ కుళాయిలు వేసే పనులు, పాఠశాలల్లో నాడు- నేడు పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు.

గూగుల్ పే, ఫోన్ పేల ద్వారా ఆర్టీసీ టికెట్లు



ఫోన్ పే ద్వారా ప్రయాణికునికి టికెట్ ఇస్తున్న విజయనగరం జోన్ కమర్షియల్ డిప్యూటీ మేనేజర్

అనకాపల్లి టౌన్: ప్రయాణికుల సౌకర్యార్థం యూటీఎస్ ఈ-పీవోఎస్ టిమ్ మిషన్లతో (నగదు రహిత) టికెట్లు జారీ చేయనున్నామని ప్రజారవాణా శాఖ (ఆర్టీసీ) విజయనగరం జోన్ కమర్షియల్ డిప్యూటీ మేనేజర్ కణితి వెంకటరావు చెప్పారు. స్థానిక డిపో ఆవరణలో మొదటిసారిగా పలాస, పర్లాకిమిడి ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో టిమ్ మిషన్లను సోమవారం ఆయన ప్రారంభించారు. నగదు రహిత టికెట్ జారీ కోసం ఫోన్ పే, గూగుల్‌పే ద్వారా బస్ చార్జి చెల్లించే విధానం ప్రవేశపెడుతున్నామన్నారు.

దీనివల్ల చిల్లర సమస్య కూడా ఉండదని ఆయన పేర్కొన్నారు. దశల వారీగా మిగిలిన బస్సుల్లో కూడా ఈ విధానం అమలు చేస్తామన్నారు. వారం రోజులుగా తమ సిబ్బందికి నూతన మిషన్లపై శిక్షణ అందిస్తున్నట్టు చెప్పారు. ముందుగా టికెట్లు తీసుకునే సౌకర్యం కూడా కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిపో ట్రాఫిక్ మేనేజర్ రవిచంద్ర, డిపో సూపర్‌వైజర్ కుమార్ పాల్గొన్నారు.

ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎల్‌పీవో కుమార్

చింతపల్లిరూరల్: సచివాలయాల్లో వచ్చిన స్పందన ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని పాడేరు డీఎల్‌పీవో కుమార్ ఆదేశించారు. లోతుగెడ్డ సచివాలయాన్ని ఆయన సోమవారం తనిఖీ చేశారు. సచివాలయాలకు ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రికార్డుల నిర్వాహణపై పలు సూచనలు చేశారు.

ముసురేసింది..!

- అల్పపీడనం ప్రభావం
- ఉమ్మడి విశాఖలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు
- నేడు, రేపు కొనసాగే అవకాశం

సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లాలో ముసురేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచి తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురుస్తోంది. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో సోమవారం రాత్రి వరకు ముసురు పట్టిన వాతావరణమే కొనసాగుతోంది. చిరుజల్లులు,మధ్యమధ్యలో వర్షం కురుస్తోంది. దీంతో రోడ్లు చిత్తడిగా మారి వాహన చోదకులకు ఇబ్బంది తలెత్తుతోంది. చిల్లర, తోపుడు బండ్ల వ్యాపారాలు సాగలేదు. వర్షం విడతల వారీగా కురుస్తుండడంతో రాత్రి ఏడెనిమిది గంటలకే దుకాణాలు మూసివేశారు. అల్పపీడనం మంగళవారం నాటికి మరింత బలపడనుంది. ఫలితంగా మంగళ, బుధ వారాల్లోనూ వానలు కొనసాగనున్నాయి. అదే సమయంలో తీరం వెంబడి గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీయనున్నాయి. దీంతో మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లవద్దని వాతావరణ శాఖ హెచ్చరించింది.

సోమవారం రాత్రి వరకు కురిసిన వర్షపాతం (సెం.మీలలో)

జిల్లా	ప్రాంతం	వర్షపాతం
అల్లూరి	కూనవరం	3.2
అల్లూరి	ఎటపాక	2.3
అల్లూరి	మారేడుమిల్లి	1.8
విశాఖపట్నం	గోపాలపట్నం	1.5
విశాఖపట్నం	సీతమ్మధార	1.4
విశాఖపట్నం	జూ పార్కు	1.3
విశాఖపట్నం	పెందుర్తి	1.3
విశాఖపట్నం	ఎండాడ	1.1
అనకాపల్లి	అనకాపల్లి	1.0

గిరిజనుల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి

- జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర
- జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు ఎన్నికై ఏడాది పూర్తయిన సందర్భంగా ముంచంగిపుట్టులో భారీ ర్యాలీ



ముంచంగిపుట్టులో ర్యాలీ నిర్వహిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర,ఎంపీటీసీలు,సర్పంచ్‌లు,నాయకులు

ముంచంగిపుట్టు: గిరిజనుల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విశేషంగా కృషి చేస్తున్నారని ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర తెలిపారు. జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు ఎన్నికై ఏడాది పూర్తయిన సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేతలు, సర్పంచ్‌లు,కార్యకర్తలతో మండల కేంద్రంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక జెడ్పీ చైర్‌పర్సన్ గృహం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు చైర్‌పర్సన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ గతంలో పోలిస్తే గిరిజన గ్రామాల అభివృద్ధి వేగంగా జరుగుతోందని, అన్ని మౌలిక సదుపాయాలు సమకూరుతున్నాయని తెలిపారు. పీవీటీజీ మహిళనైన నన్ను జెడ్పీ పీఠంపై కూర్చోబెట్టారని, నా జీవితంలో జగనన్నను ఎప్పుడూ మరిచిపోనని తెలిపారు. పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి నిరంతరం పని చేస్తున్నట్టు ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ,వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతి,మాజీ ఎంపీపీ వెచ్చంగి పద్మ,సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వెంగడ రమేష్,వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి మల్లికార్జున్,సర్పంచ్‌లు నరసింగరావు,గంగాధర్,నీలకంఠం, భాగ్యవతి,రత్న,ఎంపీటీసీ సభ్యులు సుబ్బలక్ష్మి,కొండమ్మ,కమల,పార్వతమ్మ,నబ్బో, మండల నేతలు జగబందు,గాసిరావు, మూర్తి,సోలెమాన్,రామ్మూర్తి, జయదేవ్,కొండలరావు,పులిరాజు,దాసు,మణి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీ బలం

క్షేత్రస్థాయిలో పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న కార్యకర్తలే వైఎస్సార్‌సీపీ బలమని విశాఖ ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండలంలోని ఏనుగురాయి పంచాయతీ పర్తపుట్టులో సోమవారం పార్టీ సీనియర్ నేతలు,సర్పంచ్‌లు,ఎంపీటీసీలు,వార్డు మెంబర్లు,కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షులు పాంగి మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి, గ్రామ స్థాయిలో పార్టీ మరింతగా బలోపేతం కావడానికి తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై సుభద్ర చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది కాలంలో ముంచంగిపుట్టు మండల అభివృద్ధికి జెడ్పీ నిధులు రూ.1.60 కోట్లు ఖర్చు చేసినట్టు చెప్పారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించే బాధ్యతను ప్రతి ఒక్క కార్యకర్త తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి తమన్ తదితరుల పాల్గొన్నారు.

ఇగ్నో ప్రవేశాలకు 22 వరకు గడువు

ఎంవీపీకాలనీ(విశాఖ జిల్లా): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 2022 జులై విద్యాసంవత్సరానికి గాను ప్రవేశాల గడువు ఈ నెల 22తో ముగియనుంది. ఈ మేరకు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు ప్రకటన విడుదల చేశారు. ఇగ్నో ద్వారా అందిస్తున్న డిగ్రీ, పీజీ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ ప్రవేశాలు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరగనున్నాయి.

కేంద్రం పరిధిలోని 5 జిల్లాల విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. https://ignouadmission.samarth.edu.in వెబ్‌సైట్ ద్వారా అర్హులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఈ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు తొలుత ప్రకటించిన గడువు ముగియడంతో మరోసారి గడువు పొడిగించగా, అది కూడా ఈ నెల 22తో ముగియనుంది. ఈ ప్రవేశాల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఫీజు పూర్తి రాయితీ కల్పిస్తున్నారు. పూర్తి వివరాలకు ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించాలి.

నులిపురుగుల నివారణతో జీర్ణవ్యవస్థ మెరుగు

చింతూరు ఐటీడీఏ పీవో రామశేషు


కార్యక్రమంలో మాట్లాడుతున్న రంపచోడవరం ఐటీడీఏ పీవో రామశేషు

చింతూరు: పిల్లల్లో నులిపురుగులను నివారించడం వల్ల జీర్ణవ్యవస్థ మెరుగు పడుతుందని చింతూరు ఐటీడీఏ పీవో రామశేషు అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణపై సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ నులిపురుగుల నివారణలో భాగంగా 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు ఈనెల 21న ఆల్‌బెండాజోల్ మాత్రలు మింగిస్తున్నట్టు చెప్పారు. ఆల్‌బెండాజోల్ మాత్రలు మింగించడం వల్ల పిల్లలు మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. డివిజన్లోని పిల్లలందరికీ ఈ మాత్రలు మింగించేందుకు అందరూ కృషిచేయాలని పీవో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, నాలుగు మండలాల వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

పాడేరు వ్యవసాయ సహాయ సంచాలకుడు రవిప్రకాష్


గంపరాయిలో పొలంబడి కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకుడు రవిప్రకాష్

పెదబయలు: గిరిజన రైతులు వ్యవసాయంలో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని పాడేరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు రోణంకి రవిప్రకాష్ అన్నారు. గంపరాయి పంచాయతీ కేంద్రంలోని రైతు భరోసా కేంద్రాన్ని ఆయన సోమవారం తనిఖీ చేశారు. మండల ఏవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరి పొలాన్ని పరిశీలించి, మొనలు తుంచే పద్ధతిపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వరి పంటలో రైతులు నాటులు వేసిన అనంతరం కాలిబాటలు ఏర్పాటుచేయాలని సూచించారు. దీంతో పురుగులు, తెగుళ్ల ఉధృతి తగ్గుతుందని, తద్వారా దిగుబడి పెరుగుతోందని, ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. ఈ నెల 20వ తేదీ లోగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడంతో వైఎస్సార్ రైతు భరోసా, పంటల ఇన్సూరెన్స్, రుణాలు తదితర సదుపాయాలు పొందవచ్చన్నారు. ఏపీ కమ్యూనిటీ బేస్డ్ నేచురల్ ఫార్మింగ్ ప్రతినిధి కుమారి త్రిపుర, సిబ్బంది, గిరిజన రైతులు పాల్గొన్నారు.

బెల్టుషాపు నిర్వాహకురాలి అరెస్టు

చోడవరం : నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపు నిర్వహిస్తూ అక్రమంగా 10మద్యం బాటిళ్లు కలిగి ఉన్న ఒక మహిళను చోడవరం పోలీసులు పట్టుకున్నారు. పీఎస్‌పేట గ్రామంలో ఒక మహిళ అక్రమంగా కొద్ది రోజులుగా మద్యం బెల్టు షాపు నిర్వహిస్తోంది. దీనితో నిఘా ఉంచిన చోడవరం పోలీసులు ప్రత్యేక బృందం సోమవారం ఆకస్మికంగా బెల్టు షాపు నిర్వహించే పూరిపాకలో తనిఖీ చేశారు. 10 మద్యం క్వాటర్ బాటిళ్లను సీజ్ చేశారు.

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం

- వైఎస్సార్‌సీపీ నేతల సవాల్‌పై చర్చకు గైర్హాజరైన టీడీపీ నాయకులు
- భారీ ర్యాలీకి తరలివచ్చిన పార్టీ శ్రేణులు


రాజేంద్రపాలెం నుంచి కించవానిపాలెం వరకు ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు


కించవానిపాలెంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొయ్యూరు: రానున్న ఎన్నికల్లో పాడేరు నుంచి మళ్లీ వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం తథ్యమని ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు తదితరులు స్పష్టం చేశారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమం అమలు తదితర అంశాలపై బహిరంగ చర్చకు టీడీపీ నేతలకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు సవాల్ చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా కించవానిపాలెంలో సోమవారం జరిగిన చర్చకు టీడీపీ నాయకులు ఎవరూ హాజరు కాలేదు. ఈ సందర్భంగా ఎంపీపీ రమేష్, నేతలు మాట్లాడుతూ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్నారన్నారు. పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తూ, సుపరిపాలన అందిస్తున్నారని స్పష్టం చేశారు. మ్యానిఫెస్టోకు అర్థం తెలియని టీడీపీ నేతలు చర్చకు పిలుపు ఇవ్వడం వింతగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఏజెన్సీలో విస్తృతంగా జరుగుతున్న అభివృద్ధి పనులు టీడీపీ నాయకులకు కనిపించడం లేదానని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీ పేరుతో నేతలు చేసిన అరాచకాలు, అక్రమార్జన ప్రజలకు తెలుసునన్నారు. టీడీపీ చేస్తున్న కుట్ర రాజకీయాలు, అసత్య ఆరోపణలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారని, గుణపాఠం చెబుతారన్నారు. ఇకపై ఎమ్మెల్యే, ఎంపీలపై తప్పుడు సమాచారం సోషల్ మీడియాలో పెడితే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో భాగంగా రాజేంద్రపాలెం నుంచి కించవానిపాలెం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మండలం నుంచి భారీగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు తరలివచ్చారు. బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, వైస్ ఎంపీపీలు అప్పన వెంకటరమణ, అంబటి నూకాలు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి మునిలినాయుడు, ఎంపీటీసీలు అప్పారావు, మల్లేశ్వరి, సర్పంచ్‌లు సత్యనారాయణ, రాజకుమారి, కన్నయమ్మ, వెంకటలక్ష్మి, భవానీ, నూకాలమ్మ, సోమన్నదొర, చందు, రత్నకుమారి, నాయకులు సత్యనారాయణ, రాజులమ్మ తదితరులు పాల్గొన్నారు.

జీపు బోల్తా పడి ఒకరి మృతి

మరొకరి పరిస్థితి విషమం, 8 మందికి తీవ్ర గాయాలు


మృతి చెందిన గిరిజన మహిళ రేఖమ్మ


పరిస్థితి విషమించిన రామకృష్ణ

దుంబ్రిగుడ : మండలంలోని గంటసీమ రోడ్డు డోమంగి సమీపం కల్వర్టు వద్ద జీపు బోల్తా పడిన ఘటనలో ఓ గిరిజన మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం మధ్యాహ్నం గంటసీమ నుంచి దుంబ్రిగుడ వైపునకు వస్తున్న జీపు డోమంగి సమీపం వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో జీపులో ప్రయాణిస్తున్న గంటసీమ గ్రామానికి చెందిన అర్జి రేఖమ్మ(56) అనే మహిళ అక్కడిక్కడే మృతి చెందింది. మరో వ్యక్తి రెంప రామకృష్ణ పరిస్థితి విషమంగా ఉండగా, 8 మంది తీవ్రంగా గాయపడ్డారు.

వారిని108 వాహనంలో వెంటనే అరకులోయ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అరకులోయ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

హత్యాయత్నం కేసులో నిందితుడు అరెస్టు

రాజవొమ్మంగి : కొత్తకింద్రలో ఈనెల 4వ తేదీన జరిగిన హత్యాయత్నానికి సంబంధించి నిందితుడు గొడుగు రాజుబాబును సోమవారం అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ గోపీనరేంద్రప్రసాద్ తెలిపారు. రాజుబాబు తన భార్య గొడుగు లక్ష్మీదుర్గను చంపాలన్న ఉద్దేశ్యంతో ఇంటి వద్ద వున్న లక్ష్మీదుర్గపై కర్రతో దాడి జరిపిన సంగతి విదితమే. లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు అయ్యింది.

కాగా అప్పటి నుంచి పరారీలో వున్న రాజుబాబు ఆచూకీ తెలియడంతో పగడ్బందీగా పట్టుకొన్నామన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

మావోయిస్టులకు సహకరించొద్దు


వాలీబాల్ కిట్‌ను అందజేస్తున్న ఎస్‌ఐ సంతోష్‌కుమార్


గొల్లపల్లిలో వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్‌ఐ అప్పలసూరి


గిరిజనులకు మందులు పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ శ్రీనివాస్

జి.మాడుగుల: మండలంలోని మారుమూల గ్రామాలు గొడ్డలికర్ర, రోలుగుంట, చింతగొప్ప, తర్లాలు, రసరాయి, కొత్త కిల్లంకోట, కిల్లంకోట, చేరుకుబయలు, కె.బంధవీధి, సుర్తిపల్లి, కుమ్మరిగుంట, కోడిమామిడి, రెయ్యలగెడ్డ, మడతకొండ, బురడవీధి గ్రామాల్లో మూడు రోజులుగా ఎస్‌ఐ శ్రీనివాస్ అధ్వర్యంలో పోలీస్ పార్టీతో కలసి గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. స్థానికుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకొని, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఆయన మాట్లాడుతూ మావోయిస్టులకు సహకరించవద్దని, చట్టవిరుద్ధమైన కార్యక్రమాలకు పాల్పడవద్దని గిరిజనులకు సూచించారు. గంజాయి సాగుకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం గిరిజనులకు మందులు, యువకులకు వాలీబాల్ కిట్లు, చిన్నారులకు చాక్లెట్లు పంపిణీ చేశారు.

గూడెంకొత్తవీధి: మండలంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన ఎ.దారకొండ పంచాయతీలోని తడకపల్లి, పెబ్బంపల్లి, చిలకలవీధి, నల్లమొక్కలు గ్రామాల్లో ఎస్‌ఐ అప్పలసూరి మూడు రోజుల పాటు పర్యటించారు. స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో రహదారి కోసం ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. మావోయిస్టులకు సహకరించొద్దని, గంజాయి, సారాకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న రాజ్‌మా విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. యువకులకు క్రీడా సామగ్రి అందజేశారు.

దుంబ్రిగుడ: సొవ్వ పంచాయతీ సాగేరివలస గ్రామాన్ని ఎస్‌ఐ సంతోష్‌కుమార్ సోమవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువు, క్రీడలపై దృష్టి సారించాలన్నారు. గ్రామ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు వాలీబాల్ కిట్లు అందజేశారు.

శివారు గ్రామాల్లోనూ అభివృద్ధి పనులు


చిటికెల సత్యవతి

గూడెంకొత్తవీధి : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఏజెన్సీ ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయని, శివారు గ్రామాల్లోనూ విస్తృతంగా మౌలిక సదుపాయాల కల్పన జరుగుతోందని రాష్ట్ర బ్యూటిఫికేషన్ డైరెక్టర్ చిటికెల సత్యవతి చెప్పారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో కోట్లాది రూపాయల వ్యయంతో గిరిజన గ్రామాలకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు జరుగుతుందన్నారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పర్యవేక్షణ, చొరవతో అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులు జోరుగా జరుగుతున్నాయన్నారు. మారుమూల గ్రామాల్లో సైతం పర్యటించి, ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారన్నారు. విశేష ప్రజాదరణ పొందుతున్న ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేయడం తగదని, మానుకోవాలని హితవు పలికారు.

ఇసుక డిపోలో అక్రమాలపై విచారణకు డిమాండ్


ఇసుక అక్రమాలపై విచారణ జరపాలని కోరుతున్న నాయకులు

నక్కపల్లి : మండల కేంద్రం నక్కపల్లిలో ప్రభుత్వం వారు ప్రైవేటు ఏజెన్సీ ద్వారా నిర్వహిస్తున్న ఇసుక డిపోలో పలు అక్రమాలు జరుగుతున్నాయని వాటిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కాగిత ఎంపీటీసీ ఆకేటి గోవిందరావు, మాజీ జెడ్పీటీసీ కొండబాబు, కొప్పిశెట్టి వెంకటేష్ తదితరులు కోరారు. ప్రభుత్వం ఇక్కడ ఏర్పాటు చేసిన డిపోనుంచి జగనన్న కాలనీ లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తోందని, అలాగే వినియోగదారులకు టన్నుకు రూ.1400 చొప్పున ఇసుకను సరఫరా చేస్తున్నారన్నారు. అయితే రాజమండ్రి నుంచి తెచ్చి విక్రయిస్తున్న ఇసుక సరఫరాలో పలు అవకతవకలు జరుగుతున్నాయన్నారు. కొంతమంది దళారులు, ట్రాక్టర్ యజమానులు, చోటానాయకులు డిపో నిర్వాహకులతో కుమ్మక్కయి సముద్రపు ఇసుకను ఈ నది ఇసుకలో కల్తీచేసి విక్రయిస్తున్నారని ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. కోట్లాది రూపాయల విలువ చేసే వేలాది టన్నుల ఇసుక పక్కదారి పడుతోందని ఆరోపించారు. ఎంపీటీసీ ఆకేటి గోవిందు మాట్లాడుతూ కాంట్రాక్టర్ ఇసుకను నిబంధనలకు విరుద్ధంగా బయట వ్యక్తులకు విక్రయించి ఇసుక రద్దయిందని నష్టం వచ్చినట్టు చూపించి ప్రభుత్వానికి చెల్లించాల్సిన డబ్బు ఎగవేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రస్తుతం కాంట్రాక్టర్ మారారని, పాత కాంట్రాక్టర్ హయాంలో జరిగిన ఇసుక అక్రమాలపై విచారణ జరపాలని ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు గాయాలు


అపస్మారక స్థితిలో ఉన్న కానిస్టేబుల్ కిశోర్‌కు సపర్యలు చేస్తున్న స్థానికులు

నాతవరం : నర్సీపట్నం తుని మధ్య ఆర్‌అండ్‌బి రోడ్డులో ములగపూడి మలుపు వద్ద బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొన్న సంఘటనలో కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నాతవరం పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న కిశోర్ సోమవారం ఉదయం నర్సీపట్నం నుంచి నాతవరం స్టేషన్‌కు స్కూటీపై వస్తున్నాడు. వర్షం కారణంగా రోడ్డుపై నీరు చేరడంతో ములగపూడి మలుపు వద్ద వాహనం అదుపుతప్పి మర్రిచెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కానిస్టేబుల్ హెల్మెట్ ధరించడంతో ప్రమాదం తప్పి శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారకస్థితిలో ఉన్న కిశోర్‌కు స్థానికులు సపర్యలు చేసి 108 వాహనంపై నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అతనికి ప్రాణ హాని లేదని గాయాలు కావడంతో చికిత్స పొందుతున్నారని ఎస్‌ఐ డి.లక్ష్మీనారాయణ తెలిపారు.

భూ కబ్జాపై వృద్ధురాలి నిరాహార దీక్ష


కశింకోటలో నిరాహార దీక్ష చేస్తున్న వృద్ధురాలు కొండమ్మ


దీక్ష విరమింపజేయడానికి ప్రయత్నిస్తున్న ఎస్‌ఐ ఆదినారాయణరెడ్డి, డీటీ సురేష్‌నాయుడు

కశింకోట: కశింకోటలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రత్యేక శిబిరంలో సోమవారం వేగి కొండమ్మ అనే వృద్ధురాలు తమ కుటుంబ సభ్యులతోపాటు నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. కశింకోటలోని వడ్డి వీధిలో సర్వే నంబర్ 83లో ఉన్న రిజిస్టర్ చేసిన తమ భూమిని స్థానికునితోపాటు తహసీల్దార్ కలిసి కబ్జా చేశారని ఆరోపిస్తూ, హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినా ఉల్లంఘించి కబ్జాకు పాల్పడ్డారని కొండమ్మ ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఎస్‌ఐ ఆదినారాయణరెడ్డి, హెచ్‌డిటీ సురేష్‌నాయుడు దీక్షా శిబిరాన్ని సాయంత్రం సందర్శించి సమస్య పరిష్కరిస్తామని, దీక్ష విరమించాలని కోరారు. గతంలో ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కరించలేదని దీక్ష విరమించడానికి ఆమె నిరాకరించారు. ఇదిలా ఉండగా తహసీల్దార్ బి.సుధాకర్ విలేకరుతో మాట్లాడుతూ కొండమ్మ ఆరోపణలు వాస్తవం కాదని, ఆ భూమి గ్రామ కంఠానికి చెందినదిగా తమ రికార్డుల్లో ఉందన్నారు. సమస్య హైకోర్టులో పెండింగ్‌లో ఉందన్నారు. కోర్టు ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. సీఐ ఎ.రవికుమార్ దీక్షా శిబిరాన్ని సందర్శించి సమస్య హైకోర్టులో ఉన్నందున దీక్ష చేయడం సరికాదని ఆమెకు నచ్చజెప్పి దీక్ష విరమింపజేశారు. సమస్యను జిల్లా కలెక్టర్ రవి పటాన్‌శెట్టి వద్దకు వెళ్లి నివేదిస్తే పరిష్కారం కాగలదన్నారు.

లీజుకు ఆర్టీసీ స్థలాలు

- ఒక్కో స్థలం లీజు గడువు 15 ఏళ్లు


వ్యాపారులతో మాట్లాడుతున్న కణితి వెంకటరావు

అనకాపల్లిటౌన్: ప్రజా రవాణా శాఖ(ఆర్టీసీ) ఖాళీ స్థలాలను అద్దె/లీజుకు ఇవ్వనున్నట్టు విజయనగరం జోనల్ డిప్యూటీ మేనేజర్ కణితి వెంకటరావు వెల్లడించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నర్సీపట్నం, పాడేరు ఖాళీ స్థలాలపై వ్యాపారస్తులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న స్థలాలను దశల వారీ లీజుకు ఇచ్చి, తద్వారా సంస్థకు ఆదాయం వచ్చేలా చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. ఖాళీ స్థలాల లీజు కాలపరిమితి 15 సంవత్సరాలుగా పేర్కొన్నారు. త్వరలో వేలం నిర్వహించనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారిణి కె.పద్మావతి, విజయనగరం డిప్యూటీ ఈఈ పి.వి.నరసింహారావు, నర్సీపట్నం డిపో మేనేజర్ ఎం.ఎస్.ఎస్.ధీరజ్, స్థానిక వ్యాపారులు పాల్గొన్నారు.

గృహోపకరణాలు దగ్ధం


షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిపోయిన గృహోపకరణాలు

చోడవరం : విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా చెలరేగిన మంటలకు ఇంట్లో ఉన్న గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.3లక్షలు విలువైన గృహోపకరణాలు కాలిపోయాయి. జి. జగన్నాథపురం గ్రామంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి వివరాలిలావున్నాయి. మొలుగు ప్రదీప్‌కుమార్ ఇంట్లో అంతా నిద్రిస్తున్న సమయంలో ఒక్కసారిగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగడంతో అందరూ పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో టీవీ, ఫ్రిజ్, ఫ్యాన్లు, లైట్లతో పాటు పలు గృహోపకరణాలు కాలిపోయాయి. ఇంట్లో ఉన్న గృహోపకరణాలన్నీ కాలిపోవడంతో బాధితుడు ప్రదీప్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు.

క్లుప్తంగా

ఉద్యోగులు అంకిత భావంతో పని చేయాలి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

పాడేరు రూరల్: గిరిజన ఉద్యోగులు అంకిత భావంతో పనిచేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర జెడ్పీటీసీగా గెలుపొంది ఏడాది పూర్తయిన సందర్భంగా సోమవారం పాడేరు గిరిజన భవన్‌లో ఆమెకు గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడారు. 1/70 చట్టం పటిష్టంగా అమలయ్యేలా కృషి చేయాలని, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారించాలని ఉద్యోగులు కోరారు. గిరిజన ఉద్యోగుల సంఘం ప్రతినిధులు శేషాద్రి, సింహాచలం, రామారావు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు



డిప్యూటీ సీఎం రాజన్నదొర, విద్యాశాఖా మంత్రి సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొన్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సోమవారం డిప్యూటీ సీఎం రాజన్నదొర, విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణను విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏజెన్సీలో నెలకొన్న పలు సమస్యలను తెలియజేశారు. ఇందులో భాగంగా అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుల నియామకం, పాడేరు ఐటీడీఏ పరిధిలో భాషా వలంటీర్ల నియామకం తదితర సమస్యలతో కూడిన వినతిపత్రం వారికి అందజేసినట్టు ఎమ్మెల్యే పాల్గుణ ఫోన్‌లో తెలిపారు. వారం రోజుల్లో ఆయా సమస్యలు పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చినట్టు తెలిపారు.

జాకరవలసలో పాఠశాల ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ మోతిలాల్, ఉపాధ్యాయులు

డుంబ్రిగుడ: గుంటగన్నెల పంచాయతీ జాకరవలస గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సర్పంచ్ తాంగుల మోతిలాల్ సోమవారం ప్రారంభించారు. పాడేరు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ చొరవతో భవనం త్వరగా పూర్తి చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. హెచ్‌ఎం కోగేశ్వరరావు, కాఫీ బోర్డు సభ్యుడు విశ్వనాథం, వైఎస్సార్‌సీపీ నాయకులు త్రినాథరావు, మొద్దు, దాసు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలపై అవగాహన

గూడెంకొత్తవీధి : మండలంలోని దొడ్డికొండ గ్రామాన్ని మండల ఏవో మధుసూదన్ సోమవారం సందర్శించి, సాగులో ఉన్న వరి పంటలను పరిశీలించారు. వరిలో సోకే అగ్గి తెగులు నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు పొందవచ్చని సూచించారు.

పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



స్టేషన్లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏఎస్పీ ప్రతాప్ శివ కిషోర్

కొయ్యూరు : పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చింతపల్లి ఏఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ సూచించారు. కొయ్యూరు, మంప పోలీస్ స్టేషన్లను ఆయన సోమవారం తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసులు ప్రజలతో మెరుగైన సంబంధాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ స్వామినాయుడు, మంప ఎస్‌ఐ లోకేష్ కుమార్ పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్ సేవలు

వై.రామవరం: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా వై.రామవరం వారపు సంతలో సోమవారం సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ పోలీసు బలగాల ఆధ్వర్యంలో సోమవారం సుమారు 200 మందికి భోజన, వాటర్ ప్యాకెట్లు అందజేశారు. బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎం.ఎల్.నాయుడు, ఇన్‌స్పెక్టర్ వెంకటమణ, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలతో సతమతం

- శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయ భవనం
- ప్రారంభానికి నోచుకోని రాయపల్లి-రావులపాడు రోడ్డు పనులు

గంగవరం : మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన తహసీల్దార్ కార్యాలయ భవనం ప్రస్తుతం శిథిలస్థితికి చేరుకుంది. భవనం శ్లాబ్ లీకులు మయంగా మారడంతో కార్యాలయం గదులన్నీ వర్షపునీరు చమ్మతో దర్శనమిస్తున్నాయి. శ్లాబ్ పెచ్చులు ఊడి పడుతున్నాయి. వర్షం కురిసినపుడు ప్రధాన సర్వర్ నెట్‌వర్కింగ్ రూమ్ లీకు అవుతుండడంతో కంప్యూటర్లు, ప్రింటర్లు రికార్డులు తడిచిపోతున్నాయని సిబ్బంది, స్థానికులు చెబుతున్నారు. భవనంలో అన్ని గదులు కారిపోతున్నాయంటున్నారు. గోడలు చమ్మ కారుతుండడంతో విద్యుత్ ప్రమాదం జరిగే ఆస్కారముందని పలువురు భయాందోళన చెందుతున్నారు. శ్లాబ్ పెచ్చులూడుతుండడంతో బిక్కుబిక్కు మంటూ విధులు నిర్వర్తిస్తున్నారని పలువురు చెబుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ కార్యాలయ భవనం దుస్థితిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు.



తహసీల్దార్ కార్యాలయం శ్లాబ్ దుస్థితి

నిధులు ఫుల్.. పనులు నిల్

అడ్డతీగల: అధికారుల నిర్లక్ష్యం.. కాంట్రాక్టర్ అలసత్వం వల్ల గ్రామస్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. అర్థ సంవత్సరమైనా పనులు ప్రారంభానికి నోచుకోక విడ్డూరం.. అడ్డతీగల మండలం రాయపల్లి-రావులపాడు గ్రామాల మధ్య అధ్వానంగా రహదారి నిర్మాణానికి రూ.90లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు ఏప్రిల్ 1న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తదితరులు భూమిపూజ చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.



రాయపల్లి-రావులపాడు రహదారి

ఐదు నెలలు కావస్తున్నా సంబంధిత కాంట్రాక్టర్ నేటికీ పనులు ప్రారంభించలేదు. దీంతో అధ్వాన రహదారితో నానా అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు నెలలుగా కురుస్తున్న వర్షాలతో పరిస్థితి మరింత దారుణంగా ఉందంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాత కాంట్రాక్టర్‌ను రద్దు చేసి, టెండర్ ద్వారా మరో కాంట్రాక్టర్‌తో పనులు ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ప్రాజెక్ట్స్ విభాగ అధికారుల వివరణ కోసం ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులోనికి రాలేదు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



మానవహారం నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వై.రామవరం: ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా పంచాయతీ కార్యదర్శి మధుసూధనరాజు ఆధ్వర్యంలో వై.రామవరంలో సోమవారం అవగాహన సదస్సునిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన భారీ ర్యాలీలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. గ్రామంలో పర్యటించి, ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై విస్తృతంగా ప్రచారం చేశారు. అనంతరం స్థానిక బస్టాండ్ వద్ద మానవహారం నిర్వహించి, అవగాహన కల్పించారు. ఎంపీపీ కడబాల ఆనందరావు, వైస్ ఎంపీపీలు వలాల విశ్వమ్మ, ముర్ల జోగిరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు వీరమల్ల సుబ్బలక్ష్మి, సర్పంచ్ బాలురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీడీవో బి.అశోక్‌కుమార్, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, విద్యార్థులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్ల భర్తీకి దరఖాస్తులు

పాడేరు రూరల్ : మండలంలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ల పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఎంపీడీవో కె.సాయి నవీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కిండంగి పంచాయతీలో ఒక పోస్టు, పాడేరు గ్రామ పంచాయతీలో ఒక పోస్టు ఖాళీగా ఉన్నట్టు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 20 నుంచి 22వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.దరఖాస్తులను పరిశీలించి 24న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 26న నియామక పత్రాలు అందజేస్తామన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

సీఎం జగన్‌మోహన్ రెడ్డిని కోరిన ఎమ్మెల్యే ధనలక్ష్మి



సీఎం జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రంపచోడవరం: వరదల కారణంగా కాంటూరు 45.1లో ఉన్న విలీన మండలాల వారు అనేక ఇబ్బందులు పడ్డారని, త్వరగా సర్వే పూర్తిచేసి వారిని ఆదుకోవాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి కోరారు. అమరావతి శాసనసభ ప్రాంగణంలో సోమవారం ఎమ్మెల్యే సీఎం జగన్‌మోహన్ రెడ్డిని ఎమ్మెల్యే కలిశారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. గోదావరి వరదల్లో నష్టపోయిన ఇళ్లకు రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం అందించాలని, పోలవరం ముంపు నిర్వాసితులను అన్ని రకాలుగా ఆదుకోవాలని కోరారు. ఏజెన్సీ ఆస్పత్రుల్లో వైద్యుల కొరత వల్ల డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులకు సరైన చికిత్స అందడం లేదన్నారు. వైద్యుల పోస్టులను భర్తీ చేయాలని ఆమె కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో వాల్మీకి కుల ధృవీకరణ పత్రాలు లేకపోవడం వల్ల ప్రభుత్వం అందిస్తున్న చేయూత పథకం వారికి అందడం లేదని, సెల్ఫ్ డిక్లరేషన్ ఇస్తే చేయూత పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 2008 డీఎస్సీలో ఉత్తీర్ణత పొందిన గిరిజన ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కువ భూమి ఉండి మ్యుటేషన్ అవకపోవడం వల్ల పథకాలు అందడం లేదన్నారు. మ్యుటేషన్ ప్రక్రియ వేగవంతంగా జరిగేలా చూడాలని సీఎంను ఎమ్మెల్యే ధనలక్ష్మి కోరారు. 2008 డీఎస్సీ అభ్యర్థులకు పోస్టింగ్, నిర్వాసితులను ఆదుకునేందుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

విద్యార్థులకు కంచాలు, గ్లాసులు పంపిణీ



కంచాలు, గ్లాసులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి, జడ్పీటీసీ గంగరాజు

అనంతగిరి: అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు ఎంపీపీ శెట్టి నీలవేణి, జెడ్పీటీసీ గంగరాజు చెప్పారు. కొత్తవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు పాఠశాలను ఆగస్టులో కలెక్టర్ సుమిత్‌కుమార్ సందర్శించి, పాఠశాలలో సమస్యలను హెచ్‌ఎం భాస్కరరావు, ఎంపీపీ శెట్టి నీలవేణి ద్వారా తెలుసుకున్నారు. విద్యార్థులకు కంచాలు, గ్లాసులు, కప్పులు కావాలని వారు కోరడంతో కలెక్టర్ సుమీత్ కుమార్ చొరవ తీసుకుని 400 మంది విద్యార్థులకు ఆయా సామగ్రి సమకూర్చారు. ఈ మేరకు ఎంపీపీ శెట్టి నీలవేణి, జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, ఉపాధ్యాయుల సమక్షంలోని విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని, ఉన్నతశిఖరాలకు చేరాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పదవీ బాధ్యతలు చేపట్టి, ఏడాది అవుతున్న సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీను సన్మానించారు. ఏటీ డబ్ల్యూవో వెంకటరావు, సర్పంచ్ సింహాద్రి, ఉపాధ్యాయులు సోమర, మత్స్యలింగం తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు



వై.రామవరంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

వై.రామవరం: మండల కేంద్రంలోని వారపు సంత సందర్భంగా ఎస్ఐ సంతోష్‌కుమార్, సరిహద్దు ప్రాంతమైన దుశ్చర్తి పోలీసుస్టేషన్ ఎస్ఐ గంట పృధ్వీ సంయుక్తంగా సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఏజెన్సీలో మావోయిస్టుల కదలికలు, గంజాయి అక్రమ రవాణా అవుతుందన్న సమాచారం మేరకు వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. చింతకర్రపాలెం, చామగడ్డ గ్రామాల జంక్షన్‌లో చేపట్టిన తనిఖీల్లో వాహన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ పరిశీలింఇ, సక్రమంగా లేని వారిపై కేసులు నమోదు చేశారు. సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ పోలీసు సిబ్బంది, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు సోలార్ లైట్లు



లాగరాయి జెడ్పీ పాఠశాల విద్యార్థులకు సోలార్ లైట్లు అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

రాజవొమ్మంగి: లాగరాయి, జడ్డంగి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు సోలార్ స్టడీ లైట్‌లను పడాల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. విద్యుత్ అంతరాయంతో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా పైలెట్ ప్రాజెక్టుగా మండలంలోని రెండు పాఠశాలల్లో 72 సోలార్ లైట్లు పంపిణీ చేసినట్టు అడ్మినిస్ట్రేటివ్ అధికారి కె.శ్రీనివాస్ చెప్పారు. వన్ చైల్డ్- వన్ లైట్ సంస్థ (హైదరాబాద్), పడాల చారిటబుల్ ట్రస్ట్ (కాకినాడ) సంయుక్తంగా లైట్లను పంపిణీ చేసినట్టు తెలిపారు. విద్యుత్ రీచార్జ్ అవసరం లేదని సోలార్ పేనల్‌ను కాసేపు ఎండలో ఉంచితే సరిపోతుందన్నారు. 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ లైట్లు అందజేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో ఏజెన్సీలోని అన్ని పాఠశాలల్లో పంపిణీ చేయాలనేది సంస్థ లక్ష్యమన్నారు. పడాల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు వెంకటప్రసాద్, వీరబాబు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాడు-నేడుతో విద్యాలయాలకు మహర్దశ



కాలేజీలో పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ రాజుబాబు, ప్రిన్సిపాల్ సింహాచలంనాయుడు

హుకుంపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాడు-నేడు ద్వారా రూ.54లక్షలతో చేపట్టనున్న పనులకు ఎంపీపీ కూడా రాజుబాబు సోమవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేసిందని, విద్యాలయాల్లో మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు నాడు-నేడు ద్వారా కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందన్నారు. నాడు-నేడు ద్వారా విద్యాలయాలకు మహర్దశ చేకూరుతుందన్నారు. ప్రభుత్వ సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ సింహాచలం నాయుడు, సర్పంచ్ వెంకటపూర్ణిమ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు రమ, వైస్ సర్పంచ్ గోవింద్, నాయకులు అనిల్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

గంగవరం: రాజవరం, చిన్నంపాలెం, రాజుపేట లొద్ది , భయ్యనపల్లి గ్రామాల్లోని పాఠశాలల్లో నాడు-నేడు ద్వారా చేపడుతున్న పనులకు ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని తొలి విడతలో సుమారు రూ.4కోట్లతో 18 పాఠశాలల అభివృద్ధి చెందాయని, రెండో విడతలో మరో ఎనిమిది పాఠశాలలు అభివృద్ధికి ఎంపికైనట్టు చెప్పారు. వైస్ ఎంపీపీ కుంజం గంగాదేవి, ఎంపీటీసీ సభ్యులు కనకలక్ష్మి, పద్మావతి, సర్పంచ్‌లు సుబ్బాయమ్మ, పార్వతి, రమణమ్మ, మరిడమ్మ, కామరాజు, శివదొర, డీసీసీబీ మాజీ డైరెక్టర్ వై.వెంకటేశ్వరరావు, మొల్లేరు సొసైటీ ప్రతినిధి టి.సిద్దార్థ, హెచ్‌ఎంలు, స్కూల్ కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



చిన్నంపాలెం ఎంపీపీ పాఠశాలలో పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు

రైతులకు అండగా ప్రభుత్వం



కూరవరంలో మినుము విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రంగమ్మ తదితరులు

కూనవరం: చినర్కూరు ఆర్‌బీకేలో రైతులకు ప్రభుత్వం రాయితీపై అందించిన మినుము విత్తనాలను ఎంపీపీ పాయం రంగమ్మ సోమవారం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏవో శ్రీలక్ష్మి, మండల వ్యవసాయ సలహా కమిటీ కన్వీనర్ పూర్ణానందం, సర్పంచులు అభిరామ్, లక్ష్మి పాల్గొన్నారు.

వై.రామవరం: స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతులకు మినుములు విత్తనాలను ఎంపీపీ కడబాల ఆనందరావు, వైస్ ఎంపీపీలు జోగిరెడ్డి, విశ్వమ్మ, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి పంపిణీ చేశారు. ఏవో వి.ఉషారాణి పాల్గొన్నారు.



వై.రామవరంలో మినుము విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఆనందరావు తదితరులు

హుకుంపేట: రాప గ్రామంలో రైతులకు రాజ్‌మా విత్తనాలను సర్పంచ్ లక్ష్మయ్య, ఎంపీటీసీ సభ్యుడు వెంకట్ తదితరులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ముహూర్తపు రాట



రాట ప్రతిష్టాపనలో పాల్గొన్న భక్తులు

సీలేరు : స్థానిక మార్కెట్ సెంటర్‌లోని దుర్గాదేవి ఆలయంలో దసరా ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఉత్సవాల ముహూర్తపు రాటను శ్రీను దంపతుల ఆధ్వర్యంలో పూజలు చేసి ప్రతిష్ఠించారు. సర్పంచ్ పరదేశి, ఎంపీటీసీ సభ్యుడు సాంబమూర్తి, ఎస్ఐ రామకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. ఈ నెల 25 నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు

గూడెంకొత్తవీధి : ఆర్.వి.నగర్ గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో ఉమామహేష్ సోమవారం తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు, విధుల నిర్వహణపై ఆరా తీశారు. పలు రికార్డులను పరిశీలించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సచివాలయ నిర్మాణ పనులను పరిశీలించి, పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

హుకుంపేట: ఉప్ప ప్రభుత్వ ఆస్పత్రిని జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం సోమవారం సందర్శించారు. రోగులను పరామర్శించారు. వారితో మాట్లాడి ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలను గురించి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని సిబ్బందిని కోరారు. ఆస్పత్రిలో అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి సారించాలన్నారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన



వాటర్ ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

రాజవొమ్మంగి: దూసరపాము పంచాయతీ సుబ్బంపాడు గ్రామంలో వాటర్ ట్యాంకు నిర్మాణానికి సర్పంచ్ చీడి శివ తదితరులు సోమవారం శంకుస్థాపన చేశారు. ఇందుకోసం ఎంపీ గ్రాంట్ నిధులు రూ.4.20 లక్షలతో, 5వేల లీటర్ల సామర్థ్యంతో ట్యాంకు నిర్మిస్తున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మణికంఠ తెలిపారు. ఉప సర్పంచ్ అధికారి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బీజేపీ పోరుయాత్ర

ముంచంగిపుట్టు: పెదగూడ పంచాయతీ జర్రిపడలో బీజేపీ పోరుయాత్రను సోమవారం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి శాంతకుమారి తదితరులు స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర పథకాలను వివరించారు. నేతలు రాజారావు, లక్ష్మణ్, సుబ్బారావు, గణేశ్వరరావు, భాస్కరరావు, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: చిట్టింపాడు పంచాయతీ గోపవరంలో పార్టీ నాయకుడు ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో పోరుయాత్ర నిర్వహించారు. కృష్ణారావు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పాడేరు రూరల్: కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు, గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు సోమవారం పాడేరు మోదకొండమ్మ తల్లిను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు జరిపారు.

పాఠశాల భవనం కోసం వినతి



ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబుకు వినతిపత్రం ఇస్తున్న పరశురాం

డుంబ్రిగుడ: అరకు జైపూర్ జంక్షన్ వద్ద నిర్మించిన జీటీ డబ్ల్యూవో బాలురకు కేటాయించాలని కోరుతూ విశాఖ క్యాంపు కార్యాలయంలో ఉన్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబుకు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పరశురాం సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఆయన సానుకూలంగా స్పందించినట్టు చెప్పారు.

ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

గూడెంకొత్తవీధి : సమగ్ర శిక్ష కేజీబీవీ ఒప్పంద, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సీఆర్టీలు దేవేంద్ర, దారబాబు అన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో చంద్రశేఖర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ మినిమం పే స్కేల్ అమలు చేయాలని, హెచ్ఆర్ఏ, డీఏలు అమలు చేయాలని, వారు కోరారు.వెంకటలక్ష్మి, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నేతల నిరసన

అనంతగిరి: బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న వ్యతిరేక విధానాలతో నష్టం వాటిల్లిందని, సీపీఎం మండల కార్యదర్శి నాగులు అన్నారు. మండల కేంద్రంలో వారు నిరసన తెలిపారు. పార్టీ ఆధ్వర్యంలో కరపత్రాలను పంచారు. సర్పంచ్ మోస్య, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితులకు పరామర్శ

- జీపు ప్రమాదంలో మహిళా మృతిపై ఎమ్మెల్యే పాల్గుణ విచారం
- సహాయ కార్యక్రమాలకు ఆదేశాలు

అరకులోయ : డుంబ్రిగుడ మండలం గుంటసీమ రోడ్డులో అదుపుతప్పి జీపు బోల్తా కొట్టిన ప్రమాద సంఘటనలో గిరిజన మహిళ అర్జి రేకమ్మ(56) మృతి చెందడం, మరికొంత మందికి గాయాలు పాలైన సంఘటనపై అరకులోయ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ విచారం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో ఉన్న ఎమ్మెల్యేకు ఈ ప్రమాద సంఘటన సమాచారాన్ని డుంబ్రిగుడ, అరకులోయ వైఎస్సార్‌సీపీ నేతలు ఫోన్ ద్వారా సోమవారం అందించారు. దీంతో ఎమ్మెల్యే సహాయ కార్యక్రమాలకు అధికారులతో పాటు స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలకు ఆదేశించారు.



ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న చెట్టి వికాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు

మన్య ప్రగతి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ చెట్టి వికాస్‌తో పాటు నాయకులందరూ అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రికి చేరుకుని గాయాలైన బాధిత గిరిజనులను పరామర్శించారు. ప్రమాద సంఘటనలో మృతి చెందిన రేకమ్మ కుటుంబ సభ్యులను చెట్టి వికాస్ పరామర్శించారు. రేకమ్మ మృతదేహాన్ని స్వగ్రామమైన గుంటసీమకు తరలించేందుకు మన్య ప్రగతి చారిటబుల్ ట్రస్టు అంబులెన్సును అందుబాటులో తీసుకొచ్చారు.

ప్రమాదంలో తీవ్ర గాయాలైన ఓ గిరిజనుడిని కేజీహెచ్‌కు అంబులెన్సులో తరలించే ఏర్పాట్లు చేశారు. ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న బాధిత గిరిజనులందరికీ మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఫోన్ ద్వారా స్థానిక వైద్యులను ఆదేశించారు. అరకులోయ ఎంపీపీ రంజపల్లి ఉషారాణి, వైస్ ఎంపీపీ రామన్న, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రమేష్, ఎంపీటీసీలు రామం చందర్, సర్పంచులు భీమరాజు, నాయకులు సింహాచలం, బాలరాజు, ఆనంద్, నర్సింగ్, బాబూరావు, కిరణ్ తదితరులున్నారు.

అక్రమ కట్టడాలపై చర్యలకు వినతి

ఎటపాక: గిరిజన చట్టాలకు విరుద్ధంగా దేవస్థానం భూముల్లో అక్రమ కట్టడాలు నిర్మిస్తున్న గిరిజనేతరులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం డిప్యూటీ తహసీల్దార్ పృధ్వీకి వినతిపత్రం ఇచ్చారు. గిరిజన చట్టాలు కాపాడాలని పరిషత్ డివిజన్ అధ్యక్షుడు కుంజా అనిల్ అన్నారు. దుర్గ, వెంకటలక్ష్మి, రామలక్ష్మి, వెంకటరమణ తదితరులున్నారు.